సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


శాస్త్రవేత్త శోభన్‌బాబును సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం

దుండిగల్‌: విద్యార్థులు బాల్యదశ నుంచే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సీసీఆర్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ శోభన్‌బాబు సజ్జా అన్నారు. గండిమైసమ్మలోని రవీంద్ర భారతి గ్లోబల్‌ స్కూల్‌లో శనివారం 'అగ్రినోవ ఫెస్ట్‌' అనే అంశంపై విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి శోభన్‌బాబుతో పాటు మల్లారెడ్డి అగ్రికల్చరల్‌ యూనివర్సిటీ డీన్‌ డాక్టర్‌ రాజారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు పలు రకాల వ్యవసాయ విధానాలు, జంతువుల పోషణ, వివిధ రాష్ట్రాల్లో నిర్వహించే పండుగలు తదితర అంశాలపై ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో రవీంద్ర భారతి గ్లోబల్‌ విద్యా సంస్థల అకాడమిక్‌ డైరెక్టర్‌ రాణి, అసిస్టెంట్‌ జోనల్‌ ఇన్‌చార్జి కిషోర్‌, పాఠశాల హెచ్‌ఎం అనూష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ శేషగిరి, లయన్స్‌క్లబ్‌ ప్రతినిధులు

సుభాష్‌నగర్‌: ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గాజుల రామారం కార్పొరేటర్‌ రావుల శేషగిరి అన్నారు. ఉషోదయకాలనీ ఫేజ్‌-1 కమిటీ హాల్‌లో శనివారం శ్రీనేత్రాలయ కంటి ఆసుపత్రి సౌజన్యంతో లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన శిబిరంలో పలువురు నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. కంటి సమస్యలున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సురేందర్‌ రెడ్డి, కార్యదర్శి సతీష్‌ బాబు, లయన్స్‌క్లబ్‌ గాజులరామారం అధ్యక్షుడు జీవన్‌, ఉషోదయ అధ్యక్షుడు రవికాంత్‌, జోనల్‌ చైర్‌పర్సన్‌ రంజిత్‌ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జోనల్‌ స్థాయి క్రీడలు

కుత్బుల్లాపూర్‌: 68వ ఎస్‌జీఎఫ్‌ కుత్బుల్లాపూర్‌ జోనల్‌ లెవెల్‌ ఖోఖో, కబడ్డీ, వాలీబాల్‌ టోర్నమెంట్‌ సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నట్లు కుత్బుల్లాపూర్‌ జోనల్‌ సెక్రటరీ గోనె అరుణ జ్యోతి శనివారం తెలిపారు. బాచుపల్లిలోని సూర్య గ్లోబల్‌ హై స్కూల్‌లో అండర్‌ 14, అండర్‌ 17 బాలురు, బాలికలు పాల్గొంటారని తెలిపారు. అండర్‌ 14 బాయ్స్‌ 1-1-2011 తర్వాత జన్మించిన వాళ్లు, ఆరవ తరగతి పై వాళ్లు, అండర్‌-17కు బాలురు, బాలికలు 1-1-2008 తర్వాత జన్మించిన వాళ్లు, ఆరవ తరగతి పై వాళ్లు అర్హులని పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు స్కూల్‌ బోనోఫైడ్‌, ఆధార్‌ కార్డు, ప్రిన్సిపాల్‌ నుంచి సంతకం చేయించి ఒక రోజు ముందు సమర్పించాలని కోరారు. వివరాలకు 9290496443 నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

ఆహ్వాన పత్రిక అందజేత


మేయర్‌ నీలారెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న అసోసియేషన్‌ సభ్యులు

నిజాంపేట్‌: వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని నిజాంపేట్‌ మేయర్‌ కొలన్‌ నీలారెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్‌కు చెందిన శ్రీ వినాయక యూత్‌ అసోసియేషన్‌ సభ్యులు మేయర్‌కు నవరాత్రుల ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

ఆలయాలు.. ఆధ్యాత్మిక నిలయాలు


ఆలయ భూమి పూజలో పాల్గొన్న అరుణ్‌గురుస్వామి తదితరులు

రంగారెడ్డినగర్‌: ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని అరుణ్‌ గురుస్వామి అన్నారు. శనివారం రంగారెడ్డినగర్‌ డివిజన్‌ ఏపీహెచ్‌బీ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో రూ.25 లక్షలతో నిర్మించనున్న అయ్యప్పస్వామి ఆలయ భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. కృష్ణంరాజు, వేణుల ఆధ్వర్యంలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమానికి అరుణ్‌ గురుస్వామి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కాలనీలో అయ్యప్ప ఆలయ నిర్మాణానికి పూనుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, రామచందర్‌ రావు, సాయికిరణ్‌, ఓంప్రకాశ్‌ పాండే, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

దుండిగల్‌: ప్రజలను మమేకం చేస్తూ సభ్యత్వ నమోదును చేపట్టాలని బీజేపీ జిల్లా కన్వీనర్‌ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్‌ జేకే శేఖర్‌ యాదవ్‌ అన్నారు. దుండిగల్‌ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు అనబోయిన మల్లేష్‌ యాదవ్‌ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో 12 వేలకు పైగా సభ్యత నమోదు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణుశ్వర్‌, నేతలు కృష్ణారెడ్డి, గోనె మల్లారెడ్డి, ఆంజనేయులు, శ్రీశైలం యాదవ్‌, విజయ్‌ సాయి, యశ్వంత్‌ రెడ్డి, వెంకటేష్‌ నాయక్‌, సీతారాం, ప్రశాంత్‌, యశ్వంత్‌ పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి


మహిళా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న చైర్‌ పర్సన్‌ సుంకరి కృష్ణవేణి

దుండిగల్‌: మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు మహిళా క్యాంటీన్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని దుండిగల్‌ మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ సుంకరి కృష్ణవేణి అన్నారు. దుండిగల్‌ మున్సిపల్‌ కార్యాలయ ఆవరణలో మెప్మా సౌజన్యంతో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా పురోగతి సాధించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌ మేనేజర్‌ సునంద, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్‌ మంజుల, శాంత, మహిళా రిసోర్స్‌ పర్సన్స్‌, మహిళా పొదుపు గ్రూపు సభ్యులు, బిల్‌ కలెక్టర్లు పాల్గొన్నారు.

విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సభ్యత్వ నమోదుపై సూచనలిస్తున్న బీజేపీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్‌ ఎస్‌.మల్లారెడ్డి

నిజాంపేట్‌: బీజేపీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి సభ్యత్వాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్‌ ఎస్‌.మల్లారెడ్డి అన్నారు. శనివారం ప్రగతినగర్‌ బీజేపీ కార్యాలయంలో అధ్యక్షుడు నరేంద్ర చౌదరి అధ్యక్షతన సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని, ఆ దిశగా ఇప్పటి నుండే ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో పార్లమెంట్‌ కో కన్వీనర్‌ డాక్టర్‌ ఎం.ఆర్‌.ఎస్‌.రాజు, జిల్లా కార్యదర్శి, ప్రొఫెసర్‌ చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శులు సంతోష్‌ కుమార్‌గౌడ్‌, మైలారం అశోక్‌, ఉపాధ్యక్షులు మదన్‌ గౌడ్‌, సత్యనారాయణ, శ్రీధర్‌ రెడ్డి, కార్యదర్శులు మంజు, కార్యవర్గ సభ్యులు రాహుల్‌, కార్తిక్‌, యువమోర్చా ఉపాధ్యక్షులు అర్జున్‌, మహిళా మోర్చా అధ్యక్షురాలు నవ్య, ప్రధాన కార్యదర్శి సీత తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణ లక్ష్యం ఖరారు

- బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం రూ. 197 కోట్లు
- ఇప్పటికీ పంపిణీ చేసిన రుణాలు రూ. 11 కోట్లు
- గతేడాది లింకేజీ కింద సాధించిన రుణ లక్ష్యం ప్రగతి 118 శాతం
- స్త్రీ నిధి రుణ లక్ష్యం రూ. 19 కోట్లు
- ఈ ఏడాదిలో సంఘాలకు రుణ లక్ష్యంపై డీఆర్‌డీఏ ప్రణాళిక



సాక్షి, సిటీబ్యూరో: మహిళా సంఘాలకు ప్రభుత్వం 2024-25వ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ రుణలక్ష్యాన్ని నిర్దేశించింది. మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు మండలాల్లో 3,390 సంఘాలకు రూ. 197 కోట్ల లింకేజీ రుణాన్ని మంజూరిచ్చేలా ప్రణాళికను రూపొందించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 3,383 మహిళా సంఘాలకు రూ. 164.20 కోట్లకు గాను నిర్దేశిత లక్ష్యాన్నిదాటి రూ. 194.56 కోట్ల (118.48 శాతం) రుణాలను పంపిణీ చేయటంతోపాటు రికవరీలోనూ ప్రగతిని సాధించారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ నిర్దేశిత రుణ లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

- ఇప్పటి వరకు రూ. 11 కోట్ల రుణాలకు సంబంధిత మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు వెల్లడించారు. ఇదివరకు ప్రభుత్వం ద్వారా రుణాలను తీసుకున్న వారందరూ తమ ఆదాయాన్ని అభివృద్ధి చేసుకునేలా నూనెలు, కిరాణాలు, పప్పుల మిల్లులు, ఇతరత్రా ఉప ఉత్పత్తుల తయారీలో భాగంగా భిన్నమైన యూనిట్లను నెలకొల్పుకున్నారు.
- మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్‌ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి. మరోవైపు మహిళా సంఘాలు చెల్లించిన వడ్డీని ప్రభుత్వం తిరిగి సంఘాల ఖాతాలో జమచేయాల్సి ఉండగా... దాదాపు మూడేళ్లవడ్డీ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వడ్డీ చెల్లిస్తామని, వడ్డీ లేని రుణ పథకాన్ని చేపడతామన్న కొత్త ప్రభుత్వం ప్రకటన అమలుతో మహిళా సంఘాలు మరింతగా బలోపేతం కావటంతో పాటు ప్రోత్సాహకరంగా ఉండనున్నట్లు డీఆర్‌డీఏ పేర్కొంటోంది.
- స్త్రీ నిధి కింద మహిళా సంఘాలకు రుణ లక్ష్యం రూ. 19 కోట్లు అందజేసేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. గతేడాది స్త్రీ నిధి కింద స్వయం సహాయక సంఘాలకు రుణ లక్ష్యం రూ. 15.01 కోట్లు కాగా, రూ. 15.48 కోట్లు(102.17 శాతం) పంపిణీ చేశారు. లక్ష్యానికి మించి ప్రగతి సాధించటంతో ఈ ఏడాది రుణ లక్ష్యాన్ని రూ. 19 కోట్లకు పెంచినట్లు డీఆర్డీఏ వర్గాలు పేర్కొంటున్నాయి.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సుభాష్‌నగర్‌: గాజులరామారం డివిజన్‌ ఆర్‌కే టౌన్‌షిప్‌లో రూ.41.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను శనివారం జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రారంభించారు. రోడ్డు మంజూరుకు సహకరించిన కాంగ్రెస్‌ ఇన్‌చార్జి హన్మంతరెడ్డికి కాలనీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకుడు జేమ్స్‌, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో యువకుడి మృతి


అభిషేక్‌(ఫైల్‌)

మూసాపేట: అగ్ని ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. గుంటూరు బాపట్లకు చెందిన అభిషేక్‌ (23) అమీర్‌పేటలో కోచింగ్‌ తీసుకోవడానికి రెండ్రోజుల క్రితం వచ్చాడు. హాస్టల్‌ ఉండేందుకు అవకాశం లేకపోవడంతో కొన్ని రోజుల కోసం కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని పెద్దమ్మ కూతురు ఇంటికి వెళ్లాడు. మృతుడి పెద్దమ్మ దీనమ్మ, పెదనాన్న ఆనంద్‌ రావు తమ కూతురు విమల కుమారితో కలిసి వివేకానందనగర్‌ లోని శివానంద రిహాబిలిటేషన్‌ క్వార్టర్స్‌ లో ఉంటున్నారు. విమల కుమారి ఫిజియోథెరపిస్ట్‌గా అక్కడే పని చేస్తుంది. ఈ నెల 23 రాత్రి భోజనం తర్వాత పడుకున్నాక అర్ధరాత్రి ఇంట్లో పొగ వ్యాపిస్తుండటంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి తలుపులు పగులగొట్టారు. మంటలు వ్యాపించి ఇల్లంతా పొగ కమ్ముకుంది. అప్పటికే ఊపిరాడక పోవడంతో అభిషేక్‌ పడిపోయి ఉన్నాడు. వెంటనే వారిని ఆసుపత్రికి తరలించగా అభిషేక్‌ మృతి చెందాడు. విమల, దీనమ్మ, ఆనంద్‌ రావు కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ..

కుత్బుల్లాపూర్‌: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఓ ప్రైవేట్‌ బస్సు ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి పేట్‌బషీరాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సుచిత్ర నుంచి కుత్బుల్లాపూర్‌ విలేజ్‌ వైపునకు వెళ్లే ప్రధాన రహదారిపై హార్టెన్స్‌ స్పైసీ హోటల్‌ వద్ద ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రైవేట్‌ బస్సు ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు.

ముగిసిన స్పోర్ట్స్‌ మీట్‌- 2024


విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న నాయకులు

చింతల్‌: చింతల్‌ డివిజన్‌ హెచ్‌ఎంటీ కాలనీలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్‌ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా జరుగుతున్న రాజీవ్‌గాంధీ ఎన్‌ఎస్‌యూఐ స్పోర్ట్స్‌ మీట్‌- 2024 పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా హెచ్‌ఎంటీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పలువురు ఎన్‌ఎస్‌యూఐ నేతలు హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు. వాలీబాల్‌లో ఐడీపీఎల్‌ రెయిన్‌బో జూనియర్‌ కళాశాల జట్టు విన్నర్‌గా, రన్నరఫ్‌గా రెయిన్‌బో డిగ్రీ కళాశాల జట్టు గెలుపొందాయి. కబడ్డీలో విన్నర్‌గా ఐడీపీఎల్‌ రెయిన్‌బో డిగ్రీ కాలేజ్‌, రెండవ విన్నర్‌గా సీఎంఎస్‌ కళాశాల (నిజాంపేట్‌), మూడవ విన్నర్‌గా ఐడీపీఎల్‌కు చెందిన ఎస్‌ఆర్‌ కాలేజీలు నిలిచాయి. ఎన్‌ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి ప్రతీక్‌ మద్‌ సింగ్‌ ఫహాద్‌, రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌ స్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో జాతీయ ప్రతినిధి యడమ పవన్‌జీ, మేడ్చల్‌ జిల్లా అధ్యక్షుడు రాహుల్‌ యాదవ్‌, జిల్లా ఉపాధ్యక్షుడు అరుంధ్వాజ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు సాయికిరణ్‌, నవీన్‌, విశ్వనాథ్‌, అనూప్‌ ఉనియాల్‌ పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

దుండిగల్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగులకు అన్యాయం చేస్తుందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్‌, హెల్పర్స్‌ యూనియన్‌(సీఐటీయూ) దుండిగల్‌ మండల కార్యదర్శి రాధ అన్నారు. శనివారం అంగన్‌వాడీ స్కూళ్ల వద్ద టీచర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు , బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ సేవలు చేస్తున్న అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. గతంలో తాము చేసిన సమ్మె కారణంగా అప్పటి ప్రభుత్వం రిటైర్‌మెంట్‌ బెనిఫిట్స్‌కు సంబంధించి ఇచ్చిన హామీ ప్రకారం టీచర్‌ కు రూ.2 లక్షలు, రూ.హెల్పర్‌కు లక్ష రూపాయలు కాకుండా పాత జీవో 10 ప్రకారమే అంగన్‌వాడీ టీచర్‌కు లక్ష రూపాయలు, హెల్పర్‌ కు 50 వేల రూపాయలు ఇస్తామని ప్రభుత్వం సర్క్యులర్‌లో పేర్కొనడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో అనిత, పార్వతి, సుకన్య, భాగ్యలక్ష్మి, శోభారాణి, మీన, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు జలమయం


జీడిమెట్ల డివిజన్‌లోని ఓ కాలనీ రోడ్డుపై చేరిన వరదనీరు

రంగారెడ్డినగర్‌: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రధాన రోడ్లపై వరదనీరు చేరడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కుత్బుల్లాపూర్‌, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లు జలమయమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో రోడ్లపై నిలిచిన వరదనీటిని తరలించేందుకు మాన్‌సూన్‌ సిబ్బంది చర్యలు చేపడుతుంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో కాలనీలు, బస్తీల్లోకి వరదనీరు చేరడంతో వాహనదారులు, పాదాచారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

రూపుదిద్దుకుంటున్న నాగశేష వినాయకుడు

- మండప ఏర్పాట్లలో బిజీ బిజీ
- మూసాపేట ప్రాంతానికి ఓ గుర్తింపు


మూసాపేటలో యూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సిద్ధమవుతున్న భారీ గణనాథుడు

మూసాపేట: వినాయక నవరాత్రుల సందడి మొదలైంది. వాడవాడలా వినాయక మండపాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. బొజ్జ గణపయ్య విగ్రహాన్ని బుకింగ్‌ చేసుకోవటం వంటి పనుల్లో ఆయా మండపాల నిర్వాహకులు బిజీగా ఉన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో మూసాపేట ప్రాంతానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి భారీ గణపయ్య సుమారు 60 సంవత్సరాలకు పైగా స్థానికులచే పూజలు అందుకుంటున్నాడు. ప్రతి సంవత్సరం ఒకే చోట తయారు చేసి పూజలు చేస్తారు. నవయువక యూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో 60 ఏళ్లకు పైగా వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడు అడుగుల నుంచి ప్రారంభమైన ఏకదంతుడు విగ్రహం ఎత్తు నేటికి 30 అడుగులకు చేరింది. గతంలో ఖైరతాబాద్‌లోని హుస్సేన్‌ సాగర్‌లో నిమజ్జనం చేసేవారు. ఫ్లై ఓవర్‌ కారణంగా కూకట్‌పల్లిలోని ఐడీఎల్‌ చెరువులో నిమజ్జనం చేస్తున్నారు. ఖైరతాబాద్‌ విగ్రహం తరువాత రెండవ అతి పెద్ద విగ్రహంగా పేరు గాంచింది. గతంలో ఖైరతాబాద్‌ విగ్రహం తయారు చేసే శిల్పి నిమ్మలూరి రంగారావు తయారు చేసేవారు. అనంతరం ఆయన కుమారుడు నిమ్మలూరి దుర్గాప్రసాద్‌ చేతుల మీదుగా విగ్రహం రూపు దిద్దుకుంటోంది. ప్రస్తుతం 30 అడుగుల నాగశేష వినాయకుడు రంగులద్దుకుంటున్నాడు. వినాయక చవితికి నెల రోజుల ముందు నుంచే ఇక్కడ విగ్రహం తయారీ ప్రారంభమవుతుంది. స్థానికులు, చిన్నారులు విగ్రహాన్ని చూసేందుకు వచ్చే వారికి సమీపంలో చిన్న ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. నవయువక యూత్‌ అసోసియేషన్‌ చైర్మన్‌ తూము శ్రీనివాస్‌, అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్‌ తూము శ్రావణ్‌కుమార్‌, తూము వేణు, తూము నర్సింగ్‌, శ్రీనివాస్‌, ఉప్పు వేణు తదితరుల సమక్షంలో ఈ వేడుక వైభవంగా జరుగుతుంది.

దోమలు వృద్ధి చెందకుండా చర్యలు


సూచనలు ఇస్తున్న డిప్యూటీ కమిషనర్‌ నర్సింహారావు

కుత్బుల్లాపూర్‌: వర్షాల నేపథ్యంలో కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. దోమలు వృద్ధి చెందకుండా సర్కిల్‌ పరిధిలోని ద్వారకాపూరి కాలనీ, హెచ్‌ఎంటీ ప్రాంతాల్లో ఫాగింగ్‌ చేపట్టారు. డిప్యూటీ కమిషనర్‌ నర్సింహారావు శనివారం పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. ప్రతి రోజు తప్పనిసరిగా ఫాగింగ్‌ చేపట్టాలని, ఫాగింగ్‌ నిర్వహించిన ప్రాంతాల్లో స్థానిక సంక్షేమ నేతలతో సంతకాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ ఉమారాణి, సూపర్‌వైజర్‌ ప్రవీణ్‌, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


నిర్మాణాలను కూలుస్తున్న టౌన్‌ ప్లానింగ్‌ సిబ్బంది

నిజాంపేట్‌: నిజాంపేట్‌ కార్పొరేషన్‌ 33వ డివిజన్‌ పరిధిలోని ఇంద్రన్న కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లను టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు శనివారం కూల్చివేశారు. నోటీసులు ఇవ్వకుండా కూల్చడం ఎంత వరకు సమంజసమని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి శ్రీనివాస్‌ అన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం


మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను కలిసిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్‌: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ అన్నారు. శనివారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో సంక్షేమ సంఘాలు, ప్రజా సంఘాల నేతలు వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు శ్రీశైలం గౌడ్‌ను కలిసి ఐదవ రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానాన్ని అందజేశారు.

అడ్డుకట్ట తొలగింపునకు చర్యలు


చెరువులోకి వచ్చే వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఏఈ సారా

దుండిగల్‌: ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు చెరువులోకి చేరకుండా మధ్యలో కట్ట కట్టడంతో చెరువు నిండడం లేదు. దీంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. మల్లంపేటలో గ్రామంలో కత్వ చెరువు ఉంది. ఎగువ ప్రాంతమైన దుండిగల్‌తో పాటు అటవీ ప్రాంతాల నుంచి వర్షపు నీరు ఈ చెరువులోకి వస్తుంది. కాగా ఔటర్‌ రింగ్‌ రోడ్డు కింద కొందరు వ్యక్తులు కట్ట కట్టి నీరు చెరువులోకి రాకుండా చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఇరిగేషన్‌ ఏఈ సారా శనివారం చెరువును పరిశీలించారు. కట్టను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా కత్వ చెరువు బఫర్‌లో శ్రీ లక్ష్మి శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్‌లో నిర్మించిన అక్రమ విల్లాలను పరిశీలించారు.

ఉత్సవ మూర్తుల ఊరేగింపు


యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

సుభాష్‌నగర్‌: గాజులరామారంలో అతి పురాతనమైన నల్లగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శ్రావణమాస ఆఖరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, సుదర్శన నరసింహ మహాయాగం హోమం, ఉత్సవ మూర్తుల ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ అముర ఇంద్రసేన గుప్తా, యాదగిరి, నర్రా శ్రీరాములు, సురేష్‌, నరసింహారెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ డా. ఎన్‌. అలివేలు మంగమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంగ్లం, తెలుగు, గణితం, హిస్టరీ, కామర్స్‌, కంప్యూటర్‌ సైన్స్‌ సబ్జెక్టులలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్‌ 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే రోజు ఇంటర్వ్యూలు జరుగుతాయని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వ్యక్తిగతంగా సమాచారం ఇవ్వటం కుదరదని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ 55% (ఎస్సీ, ఎస్టీ 50%) నెట్‌, సెట్‌, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు 12 నుంచి 5 గంటల లోగా కళాశాల కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని సూచించారు.